



దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 40 | శనివారం 8-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


## ఓటర్లలో జాబితాలో అవకతవకలు

**ఓటు కోసం చేసుకున్న వారికంటే**

**జాబితాలో ఎక్కువ : రాహుల్‌గాంధీ**




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి7:** ఓటర్ల జాబితాలో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓటు కోసం నమోదుచేసుకున్న వారిసంఖ్య కంటే ఎక్కువమందిని ఎన్నికల సంఘం చూపిస్తోందన్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాపై తాము అధ్యయనం చేశామని, ఎన్నో అవకతవకలు బయటపడ్డాయన్నారు. ఎన్సీపీ(శరద్ పవార్), శివసేన(ఉద్ధవ్) పార్టీ నేతలతో కలిసి రాహుల్ గాంధీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. నమోదు చేసుకున్న ఓటర్లతో పోలిస్తే ఎన్నికల సంఘం ప్రకటించిన జాబితా ఎక్కువగా ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై తాము ఎన్నికల సంఘానికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం స్పందించి మహారాష్ట్రలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలు జరిగిన తర్వాత భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు నమోదయ్యారన్నారు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన ఐదు నెలలకు శాసనసభ ఎన్నికలు జరగ్గా.. ఈ ఐదు నెలల్లో మహారాష్ట్రలో 39 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారన్నారు. 2019 విధానసభ ఎన్నికల తర్వాత నుంచి 2024 లోక్‌సభ ఎన్నికల వరకు 32 లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదుకాగా.. కేవలం ఐదు నెలల్లో 39 లక్షల మంది ఓటర్లు నమోదు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిచిన నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్త ఓటర్లు అధికంగా నమోదయ్యారన్నారు. కేవలం ఇండియా కూటమిని ఓడించడానికి బీజేపీ ఎన్నికల సంఘం సహాయంతో సరికొత్త కుట్రకు తెరలేపిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఇదే వ్యూహాన్ని బీజేపీ అమలు చేస్తోందన్నారు. భారీ సంఖ్యలో ఓటర్ల నమోదు వెనుక కుట్రదాగి ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. మహారాష్ట్రలో గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తాజాగా మహారాష్ట్రలో ఎన్నికల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు ఒకరోజు ముందు రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం ఆసక్తి రేపుతోంది. ఇండియా కూటమి ఆరోపణలపై బీజేపీ ఎలా స్పందిస్తుందనేది వేచి చూడాలి.

### నాకు, రాహుల్‌కు మధ్య అగాధం

# వట్టిమాట

## ఆయనతో నా సాన్నిహిత్యాన్ని బయటకు చెప్పుకోవాల్సిన పని లేదు

**ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** తనకూ, రాహుల్ గాంధీకి మధ్య ఎంతో అగాధం ఉందని, తనకు ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొట్టిపారేశారు. మధ్యప్రదేశ్ సభలో తాను మాట్లాడిన తర్వాత రాహుల్ గాంధీ మాట్లాడారని, తెలంగాణ ముఖ్యమంత్రి బాగా చేస్తున్నాడని చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణలో కులగణన గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించారని, బిహార్‌లో కూడా తన గురించి మాట్లాడారని వివరించారు. కులగణనపై రాహుల్‌తో ఎప్పటికప్పుడు చర్చించానని, కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం లేకుండా కులగణనను జరిపించి అసెంబ్లీలో ప్రవేశపెడతామా? అని ప్రశ్నించారు. రాహుల్‌తో తనకున్న సన్నిహిత సంబంధాల గురించి చెప్పుకోవాల్సిన అవసరం లేదని, గతంలో చంద్రబాబునాయుడుతో పని చేసినప్పుడు కూడా ఆయన తనపై ఆగ్రహంతో ఉన్నారని ప్రచారం చేశారని తప్పుబట్టారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఎమ్మెల్యేలు తనపై తిరుగుబాటు చేస్తున్నారన్న కథనాలనూ కొట్టిపారేశారు. వారు సరదాగా కూర్చుని విందు చేసుకుంటే చిలువలు పలవలు అల్లి ప్రచారం చేశారని నవ్వుతూ బదులిచ్చారు. 'అనిరుధ్ రెడ్డి పిలిస్తే పది మంది ఎమ్మెల్యేలు వెళతారా?' అని ప్రశ్నించారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి మహబూబ్‌నగర్‌కు నీటి కోసం కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడేందుకు జూపల్లి కృష్ణారావును లెటర్ ఇచ్చి తానే బెంగళూరు పంపానని చెప్పారు. తన ఢిల్లీ పర్యటనలో ఈసారి కులగణనపై, పీసీసీ కార్యవర్గంపై మాత్రమే చర్చలు జరిగాయని, మంత్రివర్గ విస్తరణపై పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటానని రేవంత్ చెప్పారు. ఎవరి పేర్లనూ తాను సిఫారసు చేయడం లేదని వివరించారు.

**అర్జంటుగా జైల్లో వేయాలన్న ఆలోచన లేదు**

ప్రతిపక్ష నేతలపై కేసులు, అరెస్టుల విషయంలో చట్టప్రకారం నడుచుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అర్జెంట్‌గా అరెస్టు చేసి జైల్లో వేయాలన్న యోచన తనకు లేదన్నారు. ఫార్ములా ఈ రేసు కేసులో లండన్ కంపెనీకి నోటీసు ఇచ్చామని, వారు టైమ్ అడిగారని, వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన తర్వాత పర్యవసానాలు ఉంటాయని తెలిపారు. కేటీఆర్ అరెస్టు ఆగిపోవడంపై మాట్లాడుతూ.. పకడ్బందీగా ఆధారాలు లేకుండా అరెస్టు అయితే బెయిల్‌పై బయటకు వస్తారని వివరించారు.

### పిసిసి కార్యవర్గం కూర్పుపై

## కెసి వేణుగోపాల్ చర్చలు

**విడివిడిగా తెలంగాణ నేతలతో సుదీర్ఘంగా సమాలోచన**

**చివరగా సిఎం రేవంత్ రెడ్డితో పలు అంశాలపై చర్చ**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి7:** పీసీసీ కార్యవర్గం కూర్పుపై తెలంగాణ అగ్రనేతలతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘ చర్చలు జరిపారు. అందులోభాగంగా రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో కేసీ వేణుగోపాల్ విడివిడిగా చర్చలు జరిపారు. ఆ క్రమంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కేసీ వేణుగోపాల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. పీసీసీ కార్యవర్గాన్ని ఒకటి లేదా రెండో రోజుల్లో ప్రకటించే అవకాశమున్నట్లు సమాచారం. మరోవైపు పీసీసీలో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండ వచ్చన్న కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి. వీరి నియామకాల్లో సామాజిక సమతుల్యం పాటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నలుగురిలో ఒకరు మాదిగ, ఒకరు ముస్లిం, ఒకరు లంబాడి, ఒకరు రెడ్డి వర్గాలకు కేటాయించాలని భావిస్తున్నట్లు సమాచారం. అలాగే 15 నుంచి 20 మందిని పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించే అవకాశముంది. అదే విధంగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులపై కూడా నేతలు ఈ సందర్భంగా కసరత్తు చేస్తున్నారు. అయితే ఈ సమావేశంలో కేబినెట్‌లో మార్పులపై ఎలాంటి సమాలోచనలు జరపలేదని తెలుస్తోంది. ప్రస్తుతానికి మంత్రి వర్గ విస్తరణ లేదని ఆ పార్టీ ముఖ్య నేతలు సైతం పేర్కొంటున్నారు. మరోవైపు మంత్రివర్గం కూర్పుపై తెలంగాణ నేతల అభిప్రాయాలను సైతం పార్టీ అధిష్టానం నేతలు సేకరిస్తున్నట్లు ఓ చర్చ అయితే జరుగుతోంది. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిలతోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యులు దీపాదాస్ మున్షిలతో ఆ పార్టీ అధిష్టానం ఒక్కొక్కరితో చర్చించి.. అభిప్రాయాలను సైతం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం అభిప్రాయాన్ని మాత్రమే తీసుకుందని.. కానీ ఇప్పుడే విస్తరణకు అవకాశం మాత్రం లేదంటూ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. గురువారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు దీపాదాస్ మున్షీ ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధిష్టానంతో వారు సమావేశమయ్యారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే నివేదికను సైతం ఆ పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు సమాచారం.

## మోదీ ఫ్రాన్స్, అమెరికా పర్యటనకు షెడ్యూల్ ఖరారు

**10నుంచి 12వ తేదీ వరకు ఫ్రాన్స్‌లో పర్యటన**

**12, 13 తేదీల్లో అమెరికాలో టూర్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి7:** ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్, అమెరికా పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 10నుంచి 12వ తేదీ వరకు ఫ్రాన్స్‌లో; 12, 13 తేదీల్లో అమెరికాలో ఆయన పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. పారిస్‌లో జరిగే కృత్రిమ మేధ సదస్సులో పాల్గొనేందుకు ఈ నెల 10వ తేదీన మోదీ ఫ్రాన్స్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. కెడారచీ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను ప్రధాని పరిశీలించ నున్నారని మిస్రీ తెలిపారు. అనంతరం 12వ తేదీ సాయంత్రానికి వాషింగ్టన్ డీసీకి చేరుకోనున్న మోదీ.. 13వ తేదీన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో భేటీ అవుతారని సమాచారం. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భేటీ కాబోతున్న ప్రధాని మోదీ.. ఈ సందర్భంగా ఆయనతో పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముంది. పలు దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్న నేపథ్యంలో మోదీ అమెరికా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు అవకాశాలు

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్,ఫిబ్రవరి7:** తెలంగాణలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు పలు సంస్థలు ముందు కొచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 500 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సెంటిలియాన్, హెచ్‌పీ రోబోటిక్స్ సంస్థల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి నమ్మకం కలిగించే విధంగా పారిశ్రామిక విధానాలు రూపొందిస్తు న్నామన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ పరిశ్రమలు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

### నేడు ఢిల్లీ అసెంబ్లీ

## ఎన్నికల ఫలితాలు

**పక్కాగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**ఆప్ నేత కేజ్రీవాల్ ఆరోపణలపై రంగంలోకి ఎసిబి**

**ఎసిబి రాకను అడ్డుకున్న ఆప్ నేతలు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి7 :** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు భాజపా ఎరవేస్తోందని కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన ఏసీబీ బృందం ఆప్ అధినేతకు లీగల్ నోటీసు పంపించింది. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు చూపాలని అందులో పేర్కొంది. ఎన్నికల ఫలితాలకు ముందు రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఈ నెల 5న ఢిల్లీ ఎన్నికలు జరగగా 8న శనివారం ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇందుకు ఇసి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 70 స్థానాలు ఉన్న అసెంబ్లీలో బిజెపి, ఆప్ మధ్య పోటాపోటీ జరిగింది. ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని వెల్లడించాయి ఈ క్రమంలో పార్టీ మారేందుకు 16 మంది ఆప్ అభ్యర్థులకు భాజపా లంచాలు ఇవ్వజూపిందంటూ కేజీవ్రాల్ ఎక్స్‌లో చేసిన పోస్టును ప్రస్తావిస్తూ.. ఆ ట్వీట్ చేసింది మీరేనా? అని నిర్ధరించాలని ఏసీబీ పేర్కొంది. ఆ ఆరోపణలకు సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ఫోన్ కాల్ అందుకున్న ఆ 16మంది అభ్యర్థులు ఎవరు? వారికి వచ్చిన నంబర్లు, సంబంధిత సమాచారాన్ని అందించాలని తెలిపింది. దీంతోపాటు దిల్లీ ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేలా ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరించాలని హెచ్చరించింది. ఆప్ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎరవేసి, తమ పార్టీని అస్థిరపరచేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని అరవింద్ కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. ఏసీబీ విచారణకు ఆదేశించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారుల బృందం.. ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న కేజీవ్రాల్ నివాసానికి వెళ్లింది. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆప్ నేతలు.. ఏసీబీ అధికారులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎటువంటి లీగల్ నోటీసులు లేకుండా అధికారులు వచ్చారని, గంటన్నర తర్వాత నోటీసులు అందించారని ఆప్ లీగల్ సెల్ అధ్యక్షుడు సంజీవ్ నాసియార్ పేర్కొన్నారు. భాజపాతో కలిసి ఎల్జీ ఈ డ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు, కేజీవ్రాల్ ఆరోపణలు సరైనవేనని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ స్పష్టం చేశారు. 16మంది కంటే ఎక్కువ మందిని ఆప్ నుంచి దూరం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

### కెటీఆర్‌కు నార్త్ వెస్టర్న్

## యూనివర్సిటీ ఆహ్వానం

**బిజినెస్ కాన్ఫరెన్స్ సదస్సులో ప్రసంగించే ఛాన్స్**



**హైదరాబాద్,ఫిబ్రవరి7:** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోని ఇల్లినాయ్‌లోని ఇవాన్ స్టన్‌లోని ప్రతిష్మాత్మక నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీలో ఏప్రిల్ 19వ తేదీన కెల్లాగ్ ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్-2025 జరగనుంది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించాలని కేటీఆర్‌కు కేఐబీసీ వైస్ ప్రెసిడెంట్ చెనాక్షా గోరెంట్ల లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దిన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.. టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్ వంటి వినూత్న ఆలోచనలతో తెలంగాణలో సరికొత్త స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందిందన్నారు. ఇది దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని చెనాక్షా గోరంట్ల గుర్తు చేశారు. ప్రపంచ ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు సాధించడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని వివరించారు. అలాగే తెలంగాణ వేదికగా భారత్‌లో పెరిగిన ఈ స్టార్టప్ ఎకో సిస్టమ్ గురించే కాకుండా.. సాంకేతిక రంగంలో వస్తున్న ఈ విప్లవాత్మక మార్పుల గురించి మరింత తెలుసుకోవాలని అమెరికాలోని బిజినెస్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని ఈ లేఖలో చెనాక్షా గోరంట్ల తెలిపారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలు తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెట్టేలా వారిని కేటీఆర్ మెప్పించి ఒప్పించిన తీరు అందరికీ ఆదర్శమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ డిజిటల్ యుగంలో యువతకు హైదరాబాద్‌ను ఉపాధి అవకాశాల గనిగా తీర్చిదిద్దడం అద్భుతమని అభివర్ణించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా దశాబ్ద కాలంలో రూపొందించిన ప్రణాళికలు, సాధించిన విజయాల తాలూకూ అనుభవాలను విద్యార్థులకు వివరించాలని ఆ లేఖలో కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సుస్థిర అభివృద్ధికి ఎలా.. పునాదులు వేయాలో, పరిపాలనలో సాంకేతికతను జోడించి, మెరుపు వేగంతో ఎలా మెరుగైన ఫలితాలు సాధించాలో తమ యూనివర్సిటీ విద్యార్థులకు సూచనలు చేయాలని కోరారు.. కేవలం తమ విద్యార్థులకే కాకుండా, సదస్సుకు హాజరయ్యే యువ పారిశ్రామికవేత్తల్లో కూడా కేటీఆర్ ప్రసంగం స్ఫూర్తి నింపడం ఖాయమని చెనాక్షా గోరంట్ల ధీమా వ్యక్తం చేశారు.

# చిరుమళ్ల పుట్టు గద్దెల మహా జాతరకు
# అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం

- ఆదివాసీ ఆ 4గురు ప్రజా ప్రతినిధులు,చిరుమళ్ల జాతర కు ఆర్థిక చేయూత కై ముఖ్యమంత్రికి నివేదన ఇవ్వడం వారి బాధ్యత
- జాతర ఆర్థిక సహాయం పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలతో పాటు రాష్ట్ర గవర్నర్ నూ కలిశాం
- ఆర్థిక సహాయం పై ప్రభుత్వాల నుండి ఇంతవరకు రాని సమాచారం
- కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ



**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ ఫిబ్రవరి7:** సమ్మక్క తల్లి ప్రారంభ మూలాలు ఉన్నటువంటి సమ్మక్క పుట్టు గద్దెల మహా జాతరకు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకున్నామని కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ తెలిపారు.. చిరుమళ్ల సమ్మక్క పుట్టు గద్దెల వద్ద జరిగిన ప్రెస్ మీట్ లో చుంచు రామకృష్ణ మాట్లాడుతూ.. గోదావరి ఒడ్డున ఎదిర అబ్రకం గుట్టలో సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణ మహోత్సవం అనవాయితి గా జరిగేదని అన్నారు కానీ చిరుమళ్ల లో పుట్టు గద్దెల జాతరకు పునాదులు పడ్డాయి కాబట్టి కళ్యాణం ఇక్కడే జరిపేటెందుకు చిరుమల్ల జాతర కమిటీ నడుం కట్టింది అన్నారు. గత 2023జాతర తో పోలిస్తే ఈసారి జరగబోయే జాతరకు సుమారు ఐదు రాష్ట్రాల నుంచి లక్షల్లో ఆదివాసి భక్తులు వస్తారు అనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.. ఒకవేలుపుతో సుమారు 30 మంది వస్తారని, వారితో పాటు తలపతులు వడ్డెలు ఆర్తి డోలు శివసత్తులు వివిధ రకాల ఆదివాసీ కళా కారులు వస్తారని అన్నారు వీరందరికి రవాణా తో పాటుగా ఖర్చులు ఉంటాయని అన్నారు. జాతర కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులను మంత్రులను కలిసాం అన్నారు, ఖమ్మం జిల్లా లో ఆదివాసీ ఆ 4 ప్రజా ప్రతినిధులు బాధ్యత గా ముఖ్యమంత్రి ని కలిసి జాతర ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రిని కలిసి నివేదన ఇవ్వవలసిన అవసరం ఉన్నది అని అన్నారు. హోం మంత్రి అమిత్ షా, అర్జున్ ముండానూ కలిశామని అన్నారు. కేంద్రం మంత్రి కిషన్ రెడ్డిని మరియు రాష్ట్ర గవర్నర్ ను కలిసామని అన్నారు. ఇంతవరకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు అన్నారు కొంతమేరకు మంత్రి సీ భద్రాద్రి కొత్తగూడెం పిఓ ఐటిడిఏ తో జాతరకు కావలసిన ఏర్పాట్లు, సౌకర్యాలు భోజన ఏర్పాట్లను కల్పించాలని మంత్రి సీతక్క ఆదేశాల తో అధికారులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో జాతర కమిటీ, చందా వంశీయులు వీరయ్య మరియు దీక్షా కుమారులు పాల్గొన్నారు

# ఆరు గ్యారెంటీల అమలుకు ఇంకా ఎన్ని రోజులు

## న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరు మధు



**చర్ల, ఫిబ్రవరి 07**

చర్ల మండలంలో శుక్రవారం న్యూ డెమోక్రసీ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా ఆరు గ్యారెంటీల అమలుపై సమావేశం ఏర్పాటు చేసారు .ఈ సమావేశం లో న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరు మధు మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కారు అధికారంలోకొచ్చే ముందు ఆరు గ్యారంటీలను ప్రజలకు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన 100 రోజులల్లో ప్రకటించింది ఈ ఆరు గ్యారెంటీల ను అమలు చేస్తానని చెప్పి ప్రకటించింది.ఇందులో ఏ ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదు అని ఇందిరమ్మ రాజ్యం ఇంటింట సౌభాగ్యం అంటూ తెలంగాణ ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు సంవత్సరంకు పైగా అవుతున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు తయారైంది అని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు 15000 ఇస్తానని ఇది అమలు చేయలేదు. పంట రుణాలను సగం మందికి ఇచ్చి చేతులు కౌలు రైతులకు రైతు హక్కులను గుర్తించి అమలు చేస్తానని చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కింది. అని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తానని ఏ ఒక్క చోట కూడా అమలు చేయలేదు అని పేదవాడికి వైద్యం అందించడంలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2500 ప్రకటించింది అమలు చేయలేదు.

అని యువ వికాసం పేరిట విద్యార్థులకు ఇస్తామన్న 5 లక్షల విద్యా భరోసా కార్డు భరోసా పథకాన్ని వెంటనే ప్రారంభించడంలో వైఫల్యత చెందింది అని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అంతట అమలు చేస్తానని చేసిన వాగ్దానాన్ని తుంగలో తొక్కింది. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వడంలో పూర్తి చెందింది ఆరు గారంటీలతోపాటు ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతానని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది ఈ 6 గ్యారంటీ అమలుకై సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ చలో హైదరాబాద్ ఈనెల 20న కదిలి రమ్మని ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా ఈ ప్రెస్ మీట్ నిర్వహించామని హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం కోరుతూ ఈనెల 11న వ్యక్తిగత దరఖాస్తుల తో చర్ల ఎమ్మార్వో ఆఫీస్ కి కదిలి రావాల్సిందిగా ప్రజల్ని కోరుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమం లో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలి

**- జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకొని ముందుకెళ్లాలి - చదివేది అర్ధవంతంగా చదువుకోవాలి - సైకాలజిస్ట్ ఎజ్రా మల్లేశం**



**కరీంనగర్, ఫిబ్రవరి 07**

విద్యార్థులు ఒక ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సైకాలజిస్ట్, తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎజ్రా మల్లేశం అన్నారు. శుక్రవారం మానకొండూరు దేవంపల్లి ఎస్సీ గురుకుల పాఠశాల/ కళాశాల లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసును తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదివేది అర్థవంతంగా చదువుకోవాలని చూసించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికా వద్దని , ప్రశాంతంగా ఉంటూ సబ్జెక్టు వారీగా రీడింగ్ రైటింగ్, రివిజన్, డిస్కషన్ చేస్తూ విద్య పట్ల శ్రద్ధ కనపరస్తే తప్పకుండా ప్రతి సబ్జెక్టు ఈజీగా అర్థమవుతుందన్నారు. విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల మీద ఇంట్రెస్ట్ లేకపోతే ఏది సరిగా అర్థం కాదన్నారు. శ్రద్ధతో మనసుపెట్టి చదువుతే ఏదైనా ఈజీగా అర్థమవుతుందన్నారు. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకొని ఆ లక్ష్యం వైపే అడుగులు వేయాలన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతూ పిల్లలను గురుకులాల్లో చేరిపిస్తున్నారు అన్నారు. మంచిగా చదువుకొని ఉన్నతంగా ఎదుగుతారని తల్లిదండ్రులు ఆశిస్తారని ఆయన తెలిపారు.పిల్లలు తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. సరైన నిద్ర, రోజులో కనీసం నాలుగు లీటర్ల మంచినీరు తాగాలన్నారు. విద్యార్థులకు పరీక్షల ముందు సమయం ఎంతో విలువైందన్నారు. టీచర్ల పర్యవేక్షణలో ప్రతి సబ్జెక్టును అర్థం చేసుకొని చదవి పరీక్షల్లో మంచి మార్కులు సాధించే విధంగా విద్యార్థులు ఉండాలని సూచించారు. అనంతరం డిసిఒ/ మానకొండూరు దేవంపల్లి గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఒక మొదటి మెట్టు లాంటివి అన్నారు.2024బి25 సంవత్సరంలో దేవంపల్లి గురుకుల విద్యార్థులు పదవతరగతి, ఇంటర్మీడియట్ లో అత్యున్నతంగా ఫలితాలు సాధించాలని కోరారు. చదువులో ఏలాంటి అనుమానాలు ఉన్న టీచర్లు మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మీకు వచ్చే డౌట్లను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని తెలిపారు. విద్యార్థుల గురి ఎప్పుడు వారి లక్ష్యం పైనే ఉండాలన్నారు. ఈ మోటివేషన్ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ , గురుకుల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ దేవంపల్లి గురుకుల పాఠశాల కళాశాల సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ కొమురయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాల్లు దేవంపల్లి పేరెంట్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవ రత్న అవార్డు గ్రహీత మొగు రం రమేష్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు రేనుకుంట బాబు, తదితరులు పాల్గొన్నారు

# రాంపూర్ డంప్ యార్డ్‌లో ఉద్గారాల (పొగ) నియంత్రణకు చర్యలు

## బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే



**వరంగల్, ఫిబ్రవరి 07**

రాంపూర్ డంప్ యార్డ్ లో ఉద్గారాల (పొగ) నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే నేడొక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాల నుండి వెలువడే అగ్ని, పొగ, ధూళి, ఉద్గారాలను ఆర్పివేయడానికి వ్యర్థాలపై నీటిని చల్లుతూ తక్షణ ఉపశమనంగా పొగ/వాయువులు దుర్వాసన రాకుండా ఉద్గారాలను నిరోధిస్తున్నామని, కాజీపేటలోని ఫిల్లింగ్ స్టేషన్ నుండి డంప్‌యార్డ్ ప్రదేశానికి సమయాన్ని ప్రయాణాన్ని తగ్గించడానికి, డంప్ యార్డ్ వద్ద ప్రత్యేకంగా ట్యాంకర్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. డంపింగ్ యార్డు వద్ద ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ నీటి లభ్యతను అందుబాటు లో ఉంచి వెంటనే నీటిని చల్లడానికి ఏర్పాటు చేశామని అన్నారు. స్వల్పకాలిక ఉపశమన చర్యలలో భాగం గా పచ్చదనాన్ని ఏర్పాటు చేయడం, బయో మైనింగ్ ప్రక్రియ లో భాగంగా ట్రీట్ చేయబడిన లెగసీ వ్యర్థాల ద్వారా భూమిని పునరుద్ధరించడం, డంపింగ్ వాహనాలు/ట్యాంకర్ల కదలికను సులభతరం చేయడానికి బ్లాక్‌లు/జోన్‌లలో అంతర్గత రోడ్లను ప్రణాళికాబద్ధంగా వేయడం వల్ల వ్యర్థాల నిర్వహణలో రాబోయే వ్యర్థాలను సరిగ్గా డంపింగ్ చేయడం జరుగుతున్నదని అన్నారు.అదనపు బయో మైనింగ్ ద్వారా రీసైక్లింగ్ ప్రక్రియ చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటికే ఉన్న బయో-మైనింగ్ ప్రాజెక్ట్ నుండి విడుదలయ్యే వ్యర్థాలను ప్రోసెస్ చేయడం మంచి ఫలితాన్ని అందించాయని. బల్దియా ఎంపిక చేసిన ప్రదేశాలలో అదనపు డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్లు (డి ఆర్ సి సి)ని ఏర్పాటు చేయడం వల్ల రాంపూర్ డంపింగ్ యార్డ్‌కు పొడి వ్యర్థాలు వెళ్లే పరిమాణాన్ని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు.

# జర్నలిస్టు ముసుగులో భూ దందా

**చెరువు శిఖం భూమిని ఖబ్జా చేసిన ఓ జర్నలిస్టు**

**అతనిపై చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు**



**తొలి సమయం నెక్కొండ ఫిబ్రవరి 7:**

నెక్కొండ మండలం చంద్రుగొండ గ్రామంలో ఉన్న ఊరకుంట లో ఉన్న శిఖం భూమిని ఖబ్జా చేసి అందులో షేడ్డు నిర్మాణం చేసిన ఓ జర్నలిస్ట్ , అంటూ అతను పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం రోజు DAO అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు...ఎందుకు ఇలా అక్రమంగా శిఖం భూమిని ఖబ్జా చేసావు, కుంటలోని నీరు వృధాగా బయటకు వెళ్లగొడుతూ రైతులకు, పశువులు నీళ్లు త్రాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తున్నావు అని గ్రామస్థులు రైతులు అడగగా నేను విలేకరి మీరు నన్ను ఎం చేయలేరు.. మీరు ఎం చేస్తారో చేసుకోండి మీ అంతు చూస్తా అని బెదిరింపులకు పాల్పడుతున్నాడని, అలాగే చెరువు శిఖం భూమిని తక్షణమే సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి శిఖం భూమిని కాపాడాలని శుక్రవారం నర్సంపేట RDO ఆఫీస్‌లో DAO శ్రీనివాసులు కి గ్రామస్థులు,రైతులు ఫిర్యాదు చేశారు.

# వీధి రౌడీల్ల కొట్టుకున్న కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు

## సమాజాన్ని ఉద్ధరించే విద్యార్థులు ఇదేం పద్ధతి...

**తొలి సమయం వరంగల్ జిల్లా ప్రత్యేక ప్రతినిధి పొన్నగంటి స్వామి రావు ఫిబ్రవరి 7:**



హనుమకొండ లోని కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకతీయ యూనివర్సిటీలోని మెస్ లో సీనియర్ విద్యార్థులను.జూనియర్ విద్యార్థులు కోపంగా చూస్తున్నారని నెపంతో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై మాకుమ్మడిగా దాడి చేశారు.మేమేం తక్కువ అంటూ జూనియర్ల సైతం సీనియర్లపై వీధి రౌడీలా విరుచుకుపోవడంతో పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి.! వీధి రౌడీల ప్రవర్తించిన విద్యార్థులపై చర్యలు కాకతీయ యూనివర్సిటీ అధికారులు స్థానిక యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# ఘనంగా రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 07**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద రమాబాయి అంబేద్కర్ 127 వ జయంతి వేడుకలను దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు రేణుకుంట్ల సాంబయ్య మాట్లాడుతూ అంటరాని తనము నిర్మూలన కొరకు తన భర్త అంబేద్కర్ తో కలిసి ఉద్యమ పోరాటాల్లో పాల్గొని తన భర్త అంబేద్కర్ పైచదువుల కొరకు ఇంగ్లాండు కు వెళ్లినప్పుడు తన స్వగ్రామమైన అంబేద్కర్ వాడలో పిడకలు చేసి అమ్మి తన భర్తకు డబ్బులు పంపించేవారు. ఆమె సహకారంతో త్యాగంతో తాను ఉన్నత శిఖరాలకు చేరారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి బొంకూరి రాజు, మారుపాక రవీందర్, మేకల చేరాలు, కృష్ణాకర్, కొయ్యడ సునీత, రేణుకుంట్ల స్వామి, శనిగరపు వెంకటేష్, సుమన్, సర్కార్, సంతోష్, చొక్కం రాజు, ఎర్ర ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# అందరిచూపు కాంగ్రెస్ వైపు

## వివిధ పార్టీ ల నాయకులు కాంగ్రెస్ పార్టీ లో చేరిక

**చర్ల, ఫిబ్రవరి 07**

శుక్రవారం చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చర్ల మండలం కుదునూరు గ్రామపంచాయతీ పరిధిలోని కుదునూరు,వీరాపురం గ్రామాల నుండి వివిధ పార్టీలకు చెందిన సిద్ధి జ్ఞానరాజు,భాస్కరరావు,కొప్పుల నతానేలు,కాలమా వీర్రాజు, బొజ్జ పాండు,చిన్న దేవ, మడివి జోగా, మసకి గంగ, పోడియం మోర,వాద్ర,ముద్ద,మడకం ఇడ్మ, కోవాసి బుద్ర ,లను భద్రాచలం నియోజకవర్గం టిపిసిసి సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరందరూ.. ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే పేదలందరికీ న్యాయం జరుగుతుందని ఈరోజు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలకమర్రి మురళి,జిల్లా ఎస్టి సెల్ ఉపాధ్యక్షులు సోడె చలపతి, మహిళా అధ్యక్షురాలు పద్మ, కిసాన్ సెల్ అధ్యక్షులు ఇందల బుచ్చిబాబు,సీనియర్ నాయకులు ఇర్ప శ్రీనివాస్,మైపా జోగారావు,మేడి రమేష్, ఆవుల శ్రీనివాసరావు, అలవాల సతీష్,యూత్ కాంగ్రెస్ నాయకులు గడిదేసి విద్యాసాగర్,యలగొండ రాకేష్ బట్ట బాలకృష్ణ,చంటి,భాస్కర్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నూతన దుస్తుల పంపిణి

**చర్ల, ఫిబ్రవరి 07**




గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ చర్ల మండలం లోని పూజారి గూడెం, లెనిన్ కాలనీ, సింగాసముద్రం గ్రామాల్లోని జి.యస్.యస్ డే కేర్ సెంటర్లోని 130 మంది నిరు పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ నీలి ప్రకాష్, చర్ల ఎస్ ఐ కేశవ్ లు పాల్గొన్నారు.వారి చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా డాక్టర్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు కొత్త బట్టలు పంపిణీ చేయడం చాలా సంతోషకరమని ఇటువంటి సహాయాన్ని అందిస్తున్నటువంటి సంస్థ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు . మారుమూల గిరిజన గ్రామాలలో పేద పిల్లలకు సహాయం చేయడానికి ఇటువంటి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని సంస్థ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో చైల్డ్ కేర్ సెంటర్ ఇంఛార్జిలు పూజారి రాజేశ్వరి, లక్ష్మి నారాయణ, సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణారెడ్డి , సతీష్ డే కేర్ సెంటర్ సిబ్బంది, సీనియర్ జర్నలిస్టు దొడ్డా ప్రభుదాస్, రిటైర్డ్ టీచర్ కొంగూరు. నర్సింహారావు గ్రామస్తులు పలువురు పాల్గున్నారు.ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన నీలి ప్రకాష్ ను సంస్థ ప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు.

# నర్సంపేటలో విచ్చలవిడిగా గంజాయి కలకలం

## గంజాయిస్మాగ్లర్లను పట్టుకున్న పోలీసులు




**తొలి సమయం నర్సంపేట ప్రతినిధి ఫిబ్రవరి 7:**
వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో విచ్చలవిడిగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడి శుక్రవారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే వరంగల్ జిల్లా నర్సంపేట శాంతినగర్ చెందిన 1) నోముల హరిప్రసాద్ శ్రీనివాస్ ఫోటో గ్రాఫి పని చేస్తూ వచ్చే డబ్బులు తన జల్సాలకు సరిపోక సులువైన మార్గంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించాలని, ఎలాగైనా గంజాయి కొని దానిని అమ్మాలని, తన స్నేహితుడైన జక్కుల అజయ్ నర్సంపేట, ఇద్దరు చాలాచోట్ల తిరిగిన గంజాయి దొరకపోవడంతో ఒరిస్సా వెళ్లి గంజాయి తీసుకువచ్చి దాన్ని నర్సంపేటకు తీసుకువచ్చి దాన్ని అమ్మే క్రమంలో పాకాల రోడ్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ దగ్గరలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై అరుణ్ గారినీ చూసి వారిద్దరూ బైక్ వదిలిపెట్టి పారిపోవుచుండగా హరిప్రసాద్ దొరికినాడు, అతని వద్ద 3.450 %ఎస్త్ర% గంజాయి మరియు ఒక మోటార్ సైకిల్ స్వాధీన పరచుకున్నాము. గంజాయి విలువ 87,000 రూపాయలు ఉంటుంది. అజయ్ పారిపోగ, హరిప్రసాద్ ను అదుపులోకి తీసుకుని ఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు
# కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉండాలి

**పార్టీ లైన్ లోనే అందరూ పని చేయాలి**

**నాయకులకు కార్యకర్తలకు మధ్యలో విభేదాలుంటే నా దృష్టికి తీసుకురావాలి**

**రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క**





**తొలి సమయం ములుగు జిల్లా ప్రతినిధి:**
మంగపేట మండల కేంద్రము లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు మైల జయరాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా మంత్రి వర్యులు సీతక్క మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలి పార్టీ లైన్ లోనే ప్రతి ఒక్కరూ పని చేయాలని నాయకులకు కార్యకర్తలకు మధ్యలో విభేదాలుంటే నా ద్రుష్టికి తీసుకురావాలిని సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉండాలి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మధ్యలోకి తీసుకెళ్లాలి మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి కానీ ఎక్కడా మాట్లాడకూడదు పార్టీ కోసం పనిచేసిన వారిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం కోసం అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలి పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థలలో టికెట్లు ఇవ్వడం జరుగుతుంది అని రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. భూమి లేని రైతు కూలీలను అధ్వానంగా చూశారని, రూ.కోట్లు ఉన్న ఆసాములకు మాత్రం రైతు బంధు సాయం ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదల అభ్యున్నతికి దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తుండటంతో బీఆర్ఎస్ నేతలకు కడుపు మంటగా ఉన్నట్లుందని మంత్రి వర్యులు సీతక్క గారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గారితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# తిరుమల తిరుపతిలో దంపతుల ఆత్మహత్య?

**తొలి సమయం ప్రత్యేక ప్రతినిధి: తిరుపతి జిల్లా ఫిబ్రవరి07**
తిరుపతి జిల్లాలో దంప తుల ఆత్మహత్య ఘటన కలకలం రేపుతోంది.. శ్రీవారి దర్శనానికి వచ్చిన దంపతులు తిరుమల కాటేజీలోనే ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. తిరుపతి అబ్బన్న కాలనీకి చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు నాయుడు (60), ఆయన భార్య అరుణ (55) తిరుమల శ్రీవారి దర్శానికి వచ్చారు. నందకం అతిథి గృహంలోని గది నెంబర్ 203ను అద్దెకు తీసుకున్నా రు. ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శు క్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. తిరుపతి నుంచి తిరుమల కొండపైకి వచ్చి కాటేజీలో ఆత్మహత్య చేసుకోవటం, అందులోనూ భార్యాభర్తలు ఇలా తిరుమలలో చనిపోవాలని నిర్ణయించుకోవటం చర్చనీయాంశంగా మారింది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. విష యం తెలుసుకున్న పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకని మృతదేహాలను పోస్టుమార్టం కోసం తిరుపతి ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్య సమాచారాన్ని తిరుపతిలో కుటుంబ



సభ్యులకు సమాచారం ఇచ్చారు పోలీసులు. పిల్లలు, బంధువులు కొండకు వచ్చి పోలీసుల విచారణకు హాజరయ్యారు.

## సమ్మక్క తల్లికి జాతర ఆహ్వానం పలికిన
# చందావంశీయులు, సమ్మక్క దీక్షా బాలలు





**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ 7:**
ముసలమ్మ గుట్టనుండి 13వతారీకున పగిడిద్ద రాజుతో కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని సమ్మక్క తల్లికి చందా వంశీయుల తో పాటుగా దీక్షా బాలలు చిరుమళ్ళ సమ్మక్క పుట్టు గద్దెల నుండి ఆహ్వానం పలికారు. కోయత్తుర్ ఆదివాసీ సంప్రదాయలను అనుసరించి సమ్మక్క తల్లికి పూలు పండ్లు పసుపు కుంకుమ రవికె ,గాజులు సమర్పణ చేసారు. ఈ కళ్యాణంలో పాల్గొనే ఎదిర, చందా వంశీయుల పడగ గుడ్డలతో పాటుగా 5 రాష్ట్రాల నుండి తరలి వస్తున్న వేల్పులను, వారు వంశస్తులను చల్లగా కాపాడి జాతరను విజయవంతం చెయ్యాలని కోరారు. తదనంతరం తిరిగి మళ్ళీ వస్తానని వీడ్కోలు పలికి ముసలమ్మ గుట్టకు బయలుదేరి సమ్మక్క క్షేమంగా చేరుకోవాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమం లో చందా వంశీయులు చందా వీరయ్య , చందా భిక్షపతి, చందా గోవర్దన్ , చందా రామారావు, చందా భూపతయ్య, కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ మరియు దీక్షా బాలలు, భక్తులు పాల్గొన్నారు.

## పర్షిక వంశీయులకు కంకణం
# కడుతున్న చందా వంశీయులు



**తొలి సమయం, ప్రత్యేక ప్రతినిధి భద్రాద్రి కొత్త గూడెం**
పగిడిద్దరాజు తోడుకొని వచ్చి సమ్మక్క తో కళ్యాణం చేయడానికి ఎదిర వెళ్లి పర్షిక వంశీయులకు కోయత్తూరు ఆచారాలతో జోడో వెళ్లి కంకణం కట్టిన చందా వంశీయులు

## చిరుమళ్ల జాతర లో భాగంగా “సమ్మక్క పగిడిద్దరాజు కళ్యాణానికి తలంబ్రాలు
# సిద్ధం చేస్తున్న చుంచు వంశస్తులు



**తొలి సమయం ప్రత్యేక ప్రతినిధి భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 6:**
ఈనెల 13 సమ్మక్క పగిడిద్దరాజుల కళ్యాణ మహోత్సవానికి తలంబ్రాలు సింగారం గ్రామ చుంచు వంశీయులు తయారుచేస్తున్నట్లు కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ ఆదివాసి 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చే మాఘమాసం ఫిబ్రవరి 13 గురువారం రాత్రి 12 గంటలకు చిరుమళ్ల లో జరిగే పగిడిద్దరాజు కళ్యాణానికి ఆదివాసి కోయత్తూర్ సంప్రదాయాలతో ముత్యాల తలంబ్రాలు ( కొట్నాలు ) సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు ఐదవ గట్టు బండాని గోత్రం శ్రీ శ్రీ బాల కుమారస్వామి (సమ్మక్క తమ్ముడు ) ఇంటి ఇలవేల్పును మడగూడెం) కొలిచే గార్ల బయ్యారం మండలం సింగారం గ్రామ చుంచు వంశస్థులకు తల్లి సమ్మక్క ఈ భాగ్యం కల్పించినట్లు తెలిపారు.

## పదవీ విరమణ చేసిన హెూంగార్డ్ ను సత్కరించిన వరంగల్ సిపి

**తొలి సమయము వరంగల్ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 7:**



సుధీర్ఘ కాలం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో హెూంగార్డ్ విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హెూం గార్డ్ సుదర్శన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ శు క్రవారం సీపీ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్ లో ఆరోగ్య పట్ల శ్రద్ద వహించాలని సిపి పదవి విరమణ చేసిన హెూం గార్డ్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ నాగయ్య, ఆర్. ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఆర్డీవోకు వినతిపత్రం

**తొలి సమయం నర్సంపేట ప్రతినిధి ఫిబ్రవరి 7**



వరంగల్ జిల్లా నర్సంపేట బీసీ హక్కు ల సాధన సమితి నర్సంపేట కన్వీనర్ మహాదేవుని జగదీష్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా నిర్వహించి బీసీ సంఘాలకు న్యాయం చేయాలని నినాదాలతో ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో పీ.ఉమారాణి కి వినతి పత్రం అందజేసిన అనంతరం మహాదేవుని జగదీష్ మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటిష్ వారు 1931 సంవత్సరంలో చేసిన కుల జన గణన తప్ప స్వాతంత్రం అనంతరం ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం కుల గణన చేపట్టలేదని 2011 సంవత్సరంలో చేపట్టిన జనాభా లెక్కలు ఉన్నాయని ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగంలో బీసీలకు 50% రిజర్వేషన్ అమలు చేయాలని చట్ట సభలో బడ్జెట్లో బీసీల వాటా బీసీలకు దక్కాలని తెలియ జేశారు ఈ కార్యక్రమంలో కోక్ కన్వీనర్స్ ఓర్స్ సాంబయ్య, ఆకారపు మోహన్, షేర్ల శ్రీనివాస్, కూచన రవీందర్,ఇల్లందుల సాంబయ్య, వెంకన్న, అనూష, అరుణ ,పద్మ స్వప్న, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరై కళాకారులతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించిన కలెక్టర్ ప్రావిణ్య**

**హన్మకొండ, ఫిబ్రవరి 07**

హన్మకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రం ఆడిటోరి యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని సంగీత, నృత్య కార్యక్రమాల్ని నిర్వహించా రు. త్యాగరాజ ఆరాధన కార్యక్రమంలో భాగంగా నిర్వహి ంచిన ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ముఖ్య అతిథిగా పాల్గొని హైదరాబాద్ నుండి వచ్చిన కళాకారులతో పాటు స్థానిక కళాకారులు, కళాశాల అధ్యాపక బృందంతో కలిసి త్యాగరాజ కీర్తనను ఆలపించారు. హైదరాబాద్ కు చెందిన పలువురు కళాకారులతో పాటు స్థానిక కళాకారులు పలు త్యాగరాజ కీర్తనలు ఆలపించగా కలెక్టర్ తిలకించారు. స్థానిక కళాకారులతో పాటు హైదరాబాద్ కు చెందిన కళాకారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించి సంగీత అభిమానులను అలరింపజేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల స్వర్ణోత్సవ వేడుకలలో పాల్గొన్న కళాకారు లందరికీ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అభినందనలు తెలియజే శారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాకారు లందరి కీ స్వర్ణోత్సవ శుభాకాంక్షలను



కలెక్టర్ తెలియజేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ నాడ్గొడ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో కళాశాల అధ్యాపకులు భాస్కర్, అనుముల యోష, హైదరా బాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ఓని విజయ్, తదితరులతోపాటు కళాకారులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులక సమ్మె నోటీస్‌పై 10న చర్చలు

**చర్చలకు కార్మిక సంఘలాను ఆహ్వానించిన ఆర్టీసీ**

**హైదరాబాద్,ఫిబ్రవరి7:** ఫిబ్రవరి 9లేదా ఆ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగడానికి టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆపరేషన్స్ ఈడీ మునిశేఖర్‌కు జనవరి 27న సమ్మె నోటీసుతోపాటు 21 డిమాండ్ల పత్రాన్ని కార్మిక సంఘాల నేతలు అందించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించింది. ఈనెల 10న సాయంత్రం 4గంటలకు చర్చలకు రావాలని ఆర్టీసీ యాజమాన్యం, ఆర్టీసీ జేఏసీకి కార్మికశాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించినట్టు కార్మికశాఖ పేర్కొంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం. రెండు పీఆర్సీల అమలు. 2021 వేతన సవరణ అమలుచేస్తూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు. కండక్టర్లు, డ్రైవర్ల ఉద్యోగభద్రతపై మార్గదర్శకత్వం. పీఎఫ్, సీసీఎస్ బకాయిల చెల్లింపు. ఆర్టీసీ ఉద్యోగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే ఆర్టీసీకి కొనుగోలు చేసి ఇవ్వాలి. ఈ-బస్సుల పేరుతో అద్దె వాహనాలను తీసుకొస్తున్నారు. వీటిపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే చెందుతుంది. వీటిని ఆర్టీసీయే తీసుకుని నడపడం వల్ల సబ్సిడీ కూడా ఆర్టీసీకి వస్తుంది. ఆర్టీసీ అభివృద్ధికి బడ్జెట్‌లో 3శాతం నిధుల కేటాయించాలి. సంస్థ అప్పులను టేకోవర్ చేయాలి. మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్‌కు బదులు మహిళలకు స్మార్ట్ కార్డుల పంపిణీ. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి. ఆర్టీసీలో ఖాళీలను భర్తీచేయాలి. పదేళ్లుగా ఆర్టీసీలో నియామకాలు లేకపోవడంలో ఉద్యోగులపై పనిభారం పెరిగింది. సుమారు 16వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయగా.. వారి పనిని సర్వీసులో ఉన్న ఉద్యోగులే చేయాల్సి వస్తోంది.పొరుగుసేవల కింద పనిచేస్తున్న విశ్రాంత అధికారులు, సూపర్‌వైజర్లను తొలగించి పదోన్నతుల ద్వారా ఆయా పోస్టులు భర్తీ చేయాలి. కార్మికులకు 8 గంటల పనిదినాల అమలు, మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల్లోపు విధులు ముగిసేలా చూడాలి. పీఎఫ్‌కు సంబంధించి ఉద్యోగుల నుంచి రికవరీ చేసిన సుమారు రూ.12 వేల కోట్లను యాజమాన్యం ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు పంపించలేదు. వెంటనే ఈ అంశాన్ని పరిష్కరించాలని కోరుతున్నారు.

# బడ్జెట్ ప్రతిపాదనలను తిరస్కరిద్దాం

**- ప్రజలకు వామపక్ష పార్టీల ఉమ్మడి పిలుపు - 14 నుంచి నిరసన కార్యక్రమాల ఆందోళనలు**

**అమరావతి,ఫిబ్రవరి7:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని వామపక్ష పార్టీలు కోరాయి. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు దేశవ్యాపితంగా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చాయి. ఆలిండియా వామపక్ష పార్టీల పిలుపు మేరకు రాష్ట్రంలో కూడా ఈనెల 14 నుండి 20 వరకు నిరసనలు తెలియజేయాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. జిల్లా కేంద్రాలలో వీలునుబట్టి ధర్నాలు, నిరసనలు ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిపి నిరసన తెలపాలని కోరుతున్నాయి.ప్రజల్లో కొనుగోలు శక్తి కుచించుకుపోయినందున ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇవ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం గర్హనీయం.

నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాదికంటే బాగా తగ్గిపోయింది. అవసరం ఉన్నప్పటికీ ఉపాధిహామీ పథకానికి నిధులు అదనంగా కేటాయించలేదు. ధరల పెరుగుదల, జిఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మికవర్గాన్ని ఈ బ్జడెట్ విస్మరించింది. ఈ ప్రజా వ్యతిరేక బ్జడెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ క్రింది ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలి. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా చేపట్టే ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలి. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలి. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50 శాతం పెంచాలి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలి. వృద్ధాప్యపు పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలి. ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో 3శాతానికి పెంచాలి. విద్యా రంగానికి జిడిపిలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలి. ఎస్సి, ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలి. వీటిల్లో ఐసిడిఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలి. అలాగే స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలి. రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలి. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులను గణనీయంగా పెంచాలి. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్‌చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ఏపీ వామపక్షపార్టీల కార్యర్శులు సిపిఐ (యం) రాష్ట్ర వి. శ్రీనివాసరావు), సిపిఐ : కె. రామకృష్ణ, సిపిఐ (యంఎల్) న్యూ డెమోక్రసీ : పి. ప్రసాద్, సిపిఐ (యంఎల్ ) : జాస్తి కిశోర్ బాబు, యంసిపిఐ(యు) : కటం నాగభూషణం, సిపిఐ (యంఎల్ ) లిబరేషన్ : బి. బంగారరావు, ఎస్ యు సి ఐ (సి) : బి. ఎస్. అమర్నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ :పి. వి. సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ : జానకి రాములు సంయుక్తంగా ప్రకటనను విడుదల చేశారు.

# ఇన్ఫోసిస్ సంచలన నిర్ణయం

**400 మంది ట్రైనీలకు లేఆఫ్ ప్రకటన**

**బెంగళూరు,ఫిబ్రవరి7:** ఫ్రెషర్ల నియామకాల విషయంలో ఆ మధ్య తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఇన్ఫోసిస్ ఎట్టకేలకు గతేడాది వారిని విధుల్లోకి తీసుకుంది. అయితే, ఇందులో కొంతమందికి సంస్థ తాజాగా ఉద్వాసన పలికినట్లు తెలుస్తోంది. కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో దాదాపు 400 మంది ట్రైనీలకు లేఆఫ్‌లు ప్రకటించినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. వరుస ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు తెలుస్తోంది. గతేడాది అక్టోబర్‌లో ట్రైనీలుగా చేరిన వారిలో సగం మందిపై వేటు పడినట్లు సమాచారం. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారిని తొలగిస్తున్నారట. ట్రైనీలను బ్యాచ్‌ల వారీగా పిలిచి వారితో 'మ్యూచువల్ సెపరేషన్' లెటర్లపై సంతకాలు చేయించుకుంటున్నట్లు సదరు కథనాలు తెలిపాయి. అయితే, దీనిపై ఇన్ఫోసిస్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. 'ఇది చాలా అన్యాయం. మేం ఫెయిల్ అవ్వాలనే ఉద్దేశంతోనే ఆ పరీక్షలను చాలా కఠినంగా పెట్టారు. ఇప్పుడు మా భవిష్యత్తు కష్టంగా మారింది' అని ఉద్వాసనకు గురైన ఓ ట్రైనీ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల్లోపు ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. ఈ పరిణామాలపై నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంఎ÷-లాయిస్ సెనెట్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై కార్మిక శాఖకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపింది. 2022-23 నియామక ప్రక్రియలో భాగంగా 2000 మంది ఫ్రెషర్లను ఇన్ఫోసిస్ ఎంపిక చేసింది. సిస్టమ్ ఇంజినీర్, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ తదితర పోస్టులకు ఎంపిక చేస్తూ, వారికి అదే ఏడాది ఆఫర్ లెటర్లు ఇచ్చింది.

## జగన్ ఇంటిముందు ప్రమాదంపై దర్యాప్తు: ఎస్పీ

**గుంటూరు,ఫిబ్రవరి7:** గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైకాపా అధినేత జగన్ ఇంటి ముందు జరిగిన అగ్ని ప్రమాదంలో కుట్ర కోణం ఉందేమో విచారణ చేస్తామని ఎస్పీ సతీశ్ కుమార్ చెప్పారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందన్న కోణంలో వివరాలు సేకరిస్తున్నామన్నారు. అనుకోకుండా జరిగిందా? ఏదైనా కుట్ర ఉందా? అనే కోణంలోనూ విచారణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. జగన్ నివాసంలోని రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలోని డేటాను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంగళగిరిలో చెప్పారు. ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్పీ తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

## సరిహద్దుల్లో పాక్ చొరబాట్ల ను భగ్నం

**ఏడుగురిని హతమార్చిన భద్రతా బలగాలు**

**శ్రీనగర్,ఫిబ్రవరి7:** భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించాలన్న పాక్ ఉగ్రవాదుల కుట్రలను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. నియంత్రణ రేఖను దాటేందుకు యత్నిస్తుండగా ఏడుగురు చొరబాటుదారులను హతమార్చాయి. మృతుల్లో పాకిస్థాన్ ఆర్మీ సిబ్బంది కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో గల కృష్ణ ఘాటి సెక్టార్‌లో ఫిబ్రవరి 4- 5 మధ్యరాత్రి వేళ ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. నియంత్రణ రేఖను దాటి భారత ఫార్వర్డ్ పోస్ట్‌పై దాడికి యత్నిస్తున్న పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌పై సైన్యం మెరుపుదాడికి పాల్పడింది. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ఏడుగురు చొరబాటుదారులు హతమైనట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. మృతుల్లో 2-3 పాకిస్థానీ ఆర్మీ రెగ్యులర్స్ ఉన్నట్లు పేర్కొన్నాయి. మిగతా వారు ఉగ్రవాదులని, వారు అల్-బదర్ గ్రూప్‌నకు చెందిన వారై ఉంటారని సదరు వర్గాలు తెలిపాయి. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శాంతి మంత్రం వల్లెవేసిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. కశ్మీర్ సహా అన్ని సమస్యలన్నింటినీ భారత్‌తో సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు ఇటీవల ఆయన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్ర సంస్థలు తాజాగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కశ్మీర్ సంఘీభావ దినం పేరుతో సంయుక్త సదస్సు నిర్వహించినట్లు తెలిసింది. దీనికి హమాస్ కూడా హాజరైనట్లు ప్రచారం జరిగింది. దీంతో భారత నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి.

## ఐలాపూర్‌లో రంగనాథ్ పర్యటన

**పటాన్‌చెరు,ఫిబ్రవరి7** సంగారెడ్డి జిల్లా ఐలాపూర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పర్యటించారు. స్థానికంగా ఉన్న ఓ ఎ÷-లాట్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగనాథ్ అక్కడికి వెళ్లారు. తమ ప్లాట్లు కబ్జా చేస్తున్నారంటూ బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐలాపూర్‌లో పర్యటించిన హైడ్రా కమిషనర్.. బాధితుల సమస్యలు విన్నారు. ఈ క్రమంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకోవడంతో వారిద్దరి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనంతరం రంగనాథ్ స్పందిస్తూ.. 'భయభ్రాంతులకు గురి చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు ఉంది. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది వింటాం. కోర్టు పరిధిలో ఉన్న అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటాం. అన్ని అంశాలను పరిశీలించి 2 నెలల్లో సమస్యను పరిష్కరిస్తాం' అని తెలిపారు.

## ఒంగోలు రూరల్ పోలీసుల ముందుకు వర్మ

**ఒంగోలు,ఫిబ్రవరి7:** వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్ వర్మపై గతేడాది ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. రామ్ గోపాల్ వర్మ ఎక్స్ ఖాతాలో వ్యూహం సినిమా పోస్టర్లు పోస్ట్ చేసి చంద్రబాబు, పవన్, లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మద్దిపాడుకు చెందిన టీడీపీ నేత రామలింగం ఫిర్యాదు చేసారు. అప్పట్లో విచారణకు రావాల్సిందిగా రామ్ గోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా పోలీసులు నోటీసులు ఇచ్చారు . కానీ కొన్ని నెలలుగా విచారణకు హాజరు కాకుండా డుమ్మా కొట్టాడు రామ్ గోపాల్ వర్మ. ఈ క్రమంలో శుక్రవారం ఒంగోలు రూరల్ సీఐ కార్యాలయంలో విచారణకు సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ హాజరయ్యాడు. ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా గతంలో ముందస్తు బెయిల్ తెచుకున్నాడు. అయితే పోలీసుల విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశాలు ఇవ్వడంతో నేడు పోలీసుల ముంగిట హాజరయ్యాడు. రామ్ గోపాల్ వర్మ విచారణకు వస్తున్న నేపథ్యంలో మద్దిపాడు మండలం వెల్లంపల్లి వద్ద వైసీపీ మర్యాద పూర్వకంగా కలిసారు. రామ్ గోపాల్ వర్మను కలిసిన వారిలో మాజీ మంత్రి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఉన్నారు. అలాగే ఒంగోలు రూరల్ సీఐ కార్యాలయం వద్దకు వైసీపీ శ్రేణులు చేరుకొని రామ్ గోపాల్ వర్మను కలిసారు. రామ్ గోపాల్ వర్మ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అనుచిత పోస్ట్ లు పెట్టడంపై ఎవరి ప్రాయమేమైనా ఉందా అని పోలీసులు ఆరా తీయనున్నారు.

## అత్యాచార బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

**విశాఖలో సిఐటియూ ఆధ్వర్యంలో ధర్నా**

**విశాఖపట్టణ,ఫిబ్రవరి7:** జివిఎంసి పరిధిలోని సింహాద్రిపురంలో నివాసం ఉంటున్న జివిఎంసి క్లాప్ డ్రైవర్‌గా పని చేస్తున్న కనకరాజు కుమార్తె పై అత్యాచారం చేసిన ఘటనపై బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ ? ఎంవిపి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన అత్యాచార ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అత్యాచార ఘటనపై హోం మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించాలని డిమాండ్ చేశారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101